సాక్షి
నాగర్‌కర్నూల్
శనివారం : 31 : మే : 2025



జూరాల కిటకిట

జూరాల గేట్లు ఎత్తడంతో అందాలను వీక్షించేందుకు సందర్శకులు తరలివచ్చారు.

వివరాలు 8లో ▸



చాంపియన్ పాలమూరు

ఇంట్రా డిస్ట్రిక్ట్ టూడే లీగ్‌లో మహబూబ్ నగర్ జట్టు చాంపియన్‌గా నిలిచింది.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
37.0 /21.9

వాతావరణం

ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరుతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రాష్ట్ర అవతరణ దినోత్సవ ముఖ్య అతిథిగా చిన్నారెడ్డి

నాగర్‌కర్నూల్: జిల్లాకేంద్రంలోని పరేడ్ మైదానంలో సోమవారం నిర్వహించే రాష్ట్ర అవతరణ దినోత్సవానికి రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడంతోపాటు జిల్లా అభివృద్ధి గురించి వివరించనున్నారు.

నాణ్యమైన ఆహారం అందించాలి



కల్వకుర్తి టౌన్: హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీల నిర్వాహకులు వారి వద్దకు వచ్చే కష్టమర్లకు నాణ్యమైన ఆహారం అందించాలని మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పలు హోటళ్లు, బేకరీలు, రెస్టారెంట్లను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. బేకరీలు, హోటళ్లు, రెస్టారెంట్లు చాలా వరకు పరిశుభ్రత పాటించడం లేదని కిచెన్లను పరిశీలించగా తెలిసిందన్నారు. పరిశుభ్రత పాటించని, దుకాణ నిర్వహణకు సంబంధించి ఎలాంటి అనుమతులు లేకపోవడం వంటి అంశాలు గుర్తించామన్నారు. నిబంధనలు పాటించని పలు బేకరీలు, హోటళ్లకు నూతన మున్సిపల్ చట్టం–2019 ప్రకారం రూ.80 వేల జరిమానా విధించామని తెలిపారు. కమిషనర్ వెంట ఆర్ఐ చంద్రయ్య, బంగారి, ఎన్విరాన్ మెంటల్ ఇంజినీర్ శివ, మున్సిపల్ సిబ్బంది తదితరులున్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లాకేంద్రంలో డయల్ యువర్ డీఎం కార్యక్రమం శనివారం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ యాదయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు ఆర్టీసీ సంస్థ అభివృద్ధికి తమ సలహాలు అందించాలన్నారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు సెల్ నం. 73824 46772 ఫోన్ చేసి సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు.

రేపు హాకీ క్రీడాకారుల ఎంపికలు

వనపర్తిటౌన్: సబ్ జూనియర్ బాలబాలికలు, మాస్టర్స్ హాకీ క్రీడాకారుల ఎంపికలు జూన్ 1 ఆదివారం నిర్వహించనున్నట్లు జిల్లా హాకీ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర హాకీ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి బోలమోని కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్ ఎంపికలకు 2009, జూన్ 1 తర్వాత జన్మించిన బాలబాలికలు అర్హులని చెప్పారు. బాలురకు జిల్లాకేంద్రంలోని బాలకిష్టయ్య క్రీడాప్రాంగణంలో, బాలికలకు సికింద్రాబాద్‌లోని ఆర్ఆర్‌సీ మైదానంలో ఎంపికలు జరగనున్నట్లు వెల్లడించారు. మాస్టర్స్ హాకీకి 40 ఏళ్లు నిండిన వారు అర్హులని, ఆసక్తిగల వారు హాకీ ఇండియా గుర్తింపు కార్డు, ఆధార్ కార్డును వెంట తీసుకెళ్లాలని చెప్పారు.

దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తి: బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికిగాను 1, 5వ తరగతిలో ప్రవేశాలకు జిల్లాలోని అర్హులైన ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు జిల్లాకు చెంది, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు మించని వారు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తు ఫారంతో పాటు దిగువ చూపిన ధ్రువపత్రాలు జతచేసి జూన్ 16లోగా కార్యాలయంలో సమర్పించాలన్నారు. కుటుంబంలో ఒక విద్యార్థి మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 1వ తరగతిలో ప్రవేశాలకు కులం, ఆదాయం, స్థానిక, జనన ధ్రువపత్రాలతో పాటు ఆధార్, రేషన్‌కార్డు ప్రతులపై గజిటెడ్ అధికారి సంతకం చేయించి సమర్పించాలన్నారు. అలాగే 5వ తరగతిలో ప్రవేశాలకు కులం, ఆదాయం, స్థానిక, 4వ తరగతి పాసైన బోనఫైడ్ (ఒరిజినల్), ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు ప్రతులపై గజిటెడ్ అధికారి సంతకం చేయించి సమర్పించాలని పేర్కొన్నారు. వివరాల కోసం జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారిని సంప్రదించాలని సూచించారు.

వేరుశనగ క్వింటాల్ రూ.5,339

గద్వాల వ్యవసాయం: జిల్లాకేంద్రంలోని మార్కెట్ యార్డుకు శుక్రవారం 12 క్వింటాళ్ల వేరుశనగ రాగా.. గరిష్టంగా రూ.5,339, కనిష్టంగా రూ.3,619, సరాసరిగా రూ.3,619 ధరలు పలికాయి. అలాగే 94 క్వింటాళ్ల వరి (సోన) రాగా గరిష్టంగా రూ.1,979, కనిష్టంగా రూ.1,509, సరాసరిగా రూ.1,979, 2 క్వింటాళ్ల కంది రాగా.. సరాసరిగా రూ.6,106 ధరలు లభించాయి.

‘సబ్సిడీ’కి మంగళం



రైతు సాగు చేసిన వరిపంట

వరి విత్తనాలపై రాయితీ ఎత్తేసిన ప్రభుత్వం

- గతంలో 30 కిలోల బస్తాకు రూ.550.. ప్రస్తుతం రూ.వెయ్యి
- జీలుగ విత్తనాలు సైతం అమాంతం పెంపు
- సన్నాలకు బోనస్ ఇస్తుండటంతో వాటికే డిమాండ్
- అన్నదాతలకు తప్పని అదనపు భారం

అచ్చంపేట: వరి విత్తనాలపై ప్రభుత్వం సబ్సిడీ ఎత్తేయడంతో రైతులపై అదనపు భారం పడుతోంది. అసలే మొగిపురుగు, ఇతర తెగుళ్లతో ఏటా రైతులు నష్టాలను చవిచూస్తుంటే విత్తనాలకు రాయితీ లేకపోవడంతో మరింత ఇబ్బంది పడుతున్నారు. తెలంగాణ, ఆంధ్ర రకాలకు గతంలో సబ్సిడీ వర్తించేది. కానీ, సబ్సిడీ ఎత్తేయడంతో రైతులు అదనంగా రూ.300 వెచ్చించాల్సి వస్తోంది. యాసంగి సీజన్ ముగియడం.. ఈ నెల 25న రోహిణి కార్తి ప్రారంభం కావడంతో రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు. దీనికితోడు ఈసారి నైరుతి రుతుపవనాలు ముందుగానే పలకరించాయి. జిల్లాలో 5.38 లక్షల ఎకరాల్లో పంటల సాగు అంచనా కాగా.. 1,60,021 ఎకరాల్లో వరి సాగులోకి రానున్నట్లు అధికారులు అంచనా వేశారు.

30 కిలోల బస్తా..

జిల్లాలో 35,020 క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరమవుతాయని భావిస్తున్నారు. తెలంగాణ వరి రకం 30 కిలోల బస్తా ఇంతకు ముందు రూ.550 ధర ఉండగా ప్రస్తుతం రూ.వెయ్యికి పెరిగింది. తెలంగాణ రకాలకు కిలో రూ.10, ఆంధ్ర రకాలపై కిలోకు రూ.5 చొప్పున సబ్సిడీ ఉండేది. కానీ, ఈసారి ఆ అవకాశం లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. సన్నరకం (బీపీటీ) 25 కిలోల బస్తాకు గత యాసంగిలో రూ.900, దొడ్డు రకం రూ.వెయ్యి ఉండగా ఇప్పుడు మరింత పెరగనున్నాయి. జిల్లా రైతులు ఎక్కువగా సొసైటీలు, ఆగ్రోస్, డీసీఎంఎస్‌ల ద్వారా విత్తన బస్తాలు కొనుగోలు చేస్తుంటారు. ప్రభుత్వం సన్నరకం వరి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తుండటంతో వాటికి డిమాండ్ పెరగనుంది.

తెగుళ్లతో పరేషాన్..

మూడేళ్లుగా మొగి పురుగు విజృంభిస్తుండటంతో రైతులు ఖరీదైన రసాయన మందులు పిచికారీ చేసినా పంటను కాపాడుకోలేకపోతున్నారు. ఈ ప్రభావం ముందుస్తు వేసిన వరి నాట్లపై తీవ్రంగా ఉంటుంది. గత యాసంగిలో పంట చేతికి వచ్చ దశలో వేరుకుళ్లు వ్యాప్తి చెందడంతో ఎకరాకు 40 బస్తాల పైనే దిగుబడి వస్తుందని ఆశించిన రైతులకు 35 బస్తాల చొప్పున దిగుబడి వచ్చింది. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని వానాకాలం పంట సాగుకు రైతులు సిద్ధమవుతుండగా సబ్సిడీ విత్తనాల భారం కుంగదీస్తుంది.

రైతులను ఆదుకోవాలి..



విత్తన కంపెనీలు ఇష్టానుసారంగా ధరలు పెంచాయి. దీంతో చిన్న, సన్నకారు రైతులపై ప్రభావం పడుతుంది. ధరల పెంపుపై ప్రభుత్వం తమకేమీ సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాలు ఇచ్చేలా చర్యలు చేపట్టి రైతులను ఆదుకోవాలి.

– వాసుదేవుడు, రైతు, రామాజిపల్లి, బల్మూర్ మండలం

వందశాతం చెల్లించాలి..



ప్రస్తుతం వరి విత్తనాలపై సబ్సిడీ లేదు. రైతులు వందశాతం చెల్లించి తీసుకోవాలి. ప్రభుత్వం సన్నరకం వరికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తుంది. జీలుగ విత్తనాలకు మాత్రం 50 శాతం సబ్సిడీ వర్తిస్తుంది. ఇవి ప్రతి మండలంలో అందుబాటులో ఉన్నాయి. అవసరమైన రైతులు వ్యవసాయాధికారుల ద్వారా పొందవచ్చు.

– చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

జీలుగ ధర పెంచి..

జిల్లాలో ప్రతి మండలానికి సుమారు 200 క్వింటాళ్లు అవసరంగా ఉండగా 30 నుంచి 50 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు సరఫరా చేశారు. జీలుగ విత్తనాలు 30 కిలోల బస్తా ధర గతేడాది రూ.1,100 ఉండగా ప్రస్తుతం రూ.2,130కు పెంచారు. వీటికి 50 శాతం సబ్సిడీతో సరఫరా చేస్తున్నారు. ధర రెండింతలు పెంచి 50 శాతం సబ్సిడీ ఇవ్వడం వల్ల ఉపయోగం ఏమీ ఉండదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం జీలుగ విత్తనాల ధర పెంచి సబ్సిడీ ప్రకటించడం వల్ల రైతులపై భారం పడుతోంది.

లాభదాయక పంటల వైపు దృష్టిసారించాలి



రైతుతో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్: రైతులు లాభదాయకమైన పంటల వైపు దృష్టిసారించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. శుక్రవారం నాగర్‌కర్నూల్, వ్యవసాయ క్లస్టర్ పరిధిలో దేశిఇటిక్యాల గ్రామంలో రైతు రమేష్‌రెడ్డి తన 5 ఎకరాల పొలంలో కొనసాగుతున్న పత్తి విత్తనాలు నాటుతున్న వ్యవసాయ పనులను కలెక్టర్ వ్యవసాయ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతుల నుంచి పంట దిగుబడి, సాగుకు వినియోగిస్తున్న విత్తనాలు, మందుల కొనుగోలులో సమస్యలు ఎదురవుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పంట దిగుబడి లాభదాయకంగా సాగాలంటే వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని, అవసరమైన సలహాలు, సూచనలు తీసుకోవాలని సూచించారు. అంతేకాకుండా రైతులకు తమ పంటలను లాభదాయకంగా ఎలా సాగు చేయాలనే వ్యవసాయ మెలకువలను పాటించడంతోపాటు అధికంగా పురుగు మందులు వాడకూడదన్నారు. పత్తితోపాటు లాభదాయక పంటలు, హార్టికల్చర్ పంటలను కూడా సాగు చేయాలని, ఆయిల్‌పాం సాగుకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని చెప్పారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయాధికారి చంద్రశేఖర్, ఏడీ పూర్ణచంద్రారెడ్డి, ఏఓ రాజు, రైతులు కృష్ణారెడ్డి, బాల్‌రెడ్డి, నిరంజన్ తదితరులున్నారు.

సమన్వయంతో పనిచేయాలి..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిర సౌర గిరి జల వికాసం పథకం అమలుకు ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి, డీఎఫ్ఓ రోహిత్ గోపిడితో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ఆర్ఓఎఫ్ఆర్, ఆర్ఓఎఫ్ఆర్ కింద భూమి హక్కులు కలిగి ఉన్న గిరిజన రైతుల ఆర్థిక, జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేక గ్రామసభలు ఏర్పాటు చేసి ఆసక్తి కలిగిన గిరిజనుల రైతులకు ఈ పథకం ఆవశ్యకత గురించి వివరించాలన్నారు.

గర్భిణులలో రక్తహీనతను అరికట్టాలి

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లాలోని ప్రతి గర్భిణికి కచ్చితంగా వైద్యాధికారి సూచన మేరకు 12 వారాల తర్వాత ప్రసవ ప్రణాళిక తయారు చేసి అమలుపరచాలని డీఎంహెచ్ఓ స్వరాజ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆశ, నోడల్ పర్సన్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా గర్భిణులలో రక్తహీనతను అరికట్టడంలో కుటుంబ సభ్యుల సహకారం తీసుకోవాలని సూచించారు. గర్భిణులు ప్రతిరోజు ఐరన్, ఫోలిక్, క్యాల్షియం మాత్రలు కచ్చితంగా వేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. గర్భిణుల్లో రక్తహీనతను అరికట్టడం వల్ల ముందస్తు ప్రసవాలు, గర్భస్రావాలు, తక్కువ బరువుతో శిశు జననాలను అరికట్టవచ్చన్నారు. హైరిస్క్ గర్భిణులు సురక్షిత మాతృత్వం పొందే వరకు వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా టీకాకరణ అధికారి రవికుమార్, ఎంహెచ్ఎన్ ప్రోగ్రాం అధికారి లక్ష్మణ్, డీపీఓ రేనయ్య, డీపీహెచ్ఎన్ఓ మంగమ్మ, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ శివకుమార్, ఏపీఓ నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ స్వరాజ్యలక్ష్మి

ఉపాధి కూలీలకు 200 రోజులు పని కల్పించాలి



ధర్నా నిర్వహిస్తున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్: ఉపాధి కూలీల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని, పట్టణ పేదలకు ఉపాధి పని పెట్టాలని, రోజు కూలి రూ.600, ఉపాధి పని దినాలు 200 రోజులు కల్పించాలని, ఉపాధి హామీ చట్టం రక్షణ అమలు చేయాలని కోరుతూ శుక్రవారం కలెక్టరేట్ ఎదుట తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహ మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న వేతనాలు తక్షణమే చెల్లించాలని, కొత్త జాబ్ కార్డులు, కూలీలకు పరికరాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు ఆధార్ కార్డు లింక్ చేసి ఆన్‌లైన్ చెల్లింపులు చేయాలన్నారు. సీనియర్ మేటీలను ప్రత్యేకంగా గుర్తించాలని సంవత్సరం మొత్తం పనులు కల్పించాలని వారిని ఫీల్డ్ అసిస్టెంట్లుగా నియమించాలని, ప్రమాదం జరిగితే ఉచిత వైద్యంతోపాటు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. ధర్నా కార్యక్రమానికి సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు హాజరై మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు దేశ్యానాయక్, బాల్‌రెడ్డి, శ్రీనివాస్, శివశంకర్, వరప్రసాద్, మధు, నాగరాజు, బాలస్వామి, సుభాష్, భాస్కర్, కాశన్న, అశోక్, అరుణ, శాంతమ్మ, వెంకటమ్మ, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

మోటార్ వాహన చట్టం నిబంధనలు పాటించాలి



నాగర్‌కర్నూల్ క్రైం: ఆర్టీసీ డ్రైవర్లు మోటారు వాహన చట్టాల నిబంధనలు పాటిస్తూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని జిల్లా రవాణా శాఖాధికారి చిన్న బాలు అన్నారు. శుక్రవారం ఆర్టీసీ డిపోలో ఉత్తమ ప్రతిభకనబరిచిన డ్రైవర్లు, కండక్టర్లకు అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి డ్రైవర్ నియమ, నిబంధనలు పాటిస్తూ డ్రైవింగ్ చేయాలని, రోడ్డుపైన బస్సు ఎడమవైపు మాత్రమే ఆపాలన్నారు. మద్యం తాగి ఆర్టీసీ బస్సు నడపకూడదని, డ్రైవింగ్ చేసేటప్పుడు ఫోన్ మాట్లాడవద్దని చెప్పారు. రోడ్డుపైన వస్తున్న ప్రయాణికులను గమనించి బస్సు డ్రైవింగ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ బాలసరస్వతి, మెకానికల్ ఫోర్ మెన్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

- ఏడు యూనిట్లలో 276 మెగావాట్లు
- 17 వేల క్యూసెక్కుల నీటి వినియోగం

అత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద వస్తుండటంతో ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి వేగంగా కొనసాగుతోంది. శుక్రవారం ఎగువ 4 యూనిట్ల నుంచి 156 మెగావాట్లు, దిగువ 3 యూనిట్ల నుంచి 120 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ప్రాజెక్టుకు వరద పెరిగితే 11 యూనిట్ల నుంచి పూర్తిస్థాయిలో ఉత్పత్తి చేపడతామని.. ప్రస్తుతం 17 వేల క్యూసెక్కుల నీటిని వినియోగించి విద్యుదుత్పత్తి చేస్తున్నట్లు వివరించారు.

సుంకేసులకు కొనసాగుతున్న వరద..

రాజోళి: మండలంలోని సుంకేసుల బ్యారేజీకి శుక్రవారం ఎగువ నుంచి వరద నీటి రాక కొనసాగుతోంది. 4,504 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ఒక గేటు తెరిచి 4,345 క్యూసెక్కుల నీటిని దిగువకు, కేసీ కెనాల్‌కు 159 క్యూసెక్కులను వదులుతున్నట్లు జేఈ మహేంద్ర వివరించారు.




దిగువ జూరాల పవర్‌హౌజ్‌లోకి చేరుతున్న వరద

రైతువేదికలు.. సౌర కేంద్రాలు

భవనాలపై ప్యానల్స్ ఏర్పాటుకు ప్రభుత్వం సన్నద్ధం

- ఒక్కో కేంద్రం వద్ద 5 కిలోవాట్ల సామర్థ్యం..
- కేంద్రాల నిర్వహణకు విద్యుత్ విక్రయం
- పైలెట్ గ్రామాలైన జానంపేట, కొండారెడ్డిపల్లిలో విజయవంతం
- అన్ని వేదికల్లో ఏర్పాటుకు సిద్ధమవుతున్న టీజీ రెడ్‌కో



జిల్లాల వారీగా రైతువేదికలు

మహబూబ్‌నగర్	87
నాగర్‌కర్నూల్	140
జోగుళాంబ గద్వాల	94
నారాయణపేట	77
వనపర్తి	69

కోస్గి: బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో నిర్మించిన రైతువేదికల నిర్వహణకు నిధులు సమకూరడం లేదు. ఈ క్రమంలో ప్రభుత్వం ఆదాయ సమీకరణకు రైతువేదిక భవనాలపై సోలార్ ప్యానెల్‌లు ఏర్పాటుచేసి విద్యుదుత్పత్తి చేసి విక్రయించేలా చర్యలు తీసుకుంటోంది. ఒక్కో వేదికపై 5 కిలోవాట్ల సామర్థ్యం గల సౌర పలకలు అమర్చడంతో విద్యుత్ అవసరాలు పోను ఏడాదికి సుమారు రూ.25 వేల ఆదాయం సమకూరేలా ప్రణాళికలు రూపొందించింది.

పైలెట్ గ్రామాల్లో విజయవంతం..

రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లాను ప్రామాణికంగా తీసుకొని జిల్లాకు రెండు చొప్పున పైలెట్ గ్రామాల రైతువేదికలను ఎంపిక చేసి సౌర విద్యుదుత్పత్తి చేపట్టింది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో మహబూబ్‌నగర్ జిల్లా జానంపేట, నాగర్‌కర్నూల్ జిల్లా వంగూర్ మండలం కొండారెడ్డిపల్లిని ఎంపిక చేసింది. ఆయా గ్రామాల్లో విజయవంతం కావడంతో మిగిలిన రైతువేదికపై సోలార్ ప్యానెల్‌లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో రెడ్‌కో అధికారులు సిద్ధమయ్యారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో మొత్తం 467 రైతువేదికలపై సోలార్ ప్యానెల్స్ బిగించి సౌర విద్యుత్ తయారీకి చర్యలు తీసుకుంటోంది.

నిర్వహణ భారం..

గత ప్రభుత్వ హయంలో రైతులను సమావేశపర్చి శాస్త్రవేత్తల ద్వారా శిక్షణ, సలహాలు, సూచనలు అందించడంతో పాటు ఎరువులు, విత్తనాల పంపిణీ కోసం 5 వేల ఎకరాలను ఓ క్లస్టర్‌గా విభజించి ఒక్కో క్లస్టర్‌కు ఒకటి చొప్పున రైతువేదిక నిర్మించారు. వీటి నిర్వహణ బాధ్యతను ఏఈఓలకు అప్పగించారు. భవనాల నిర్మాణం పూర్తయినా.. నిర్వహణకు నిధులు మంజూరుగాకపోవడంతో అధికారులు సైతం మిన్నకుండిపోయారు. సొంతంగా ఆదాయం లేకపోవడం, ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రైతువేదికల లక్ష్యం నీరుగారుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతోంది. రైతువేదికలపై సోలార్ పలకల ఏర్పాటుతో ఆదాయం సమకూర్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రభుత్వం తాజా నిర్ణయంతో రైతువేదికల నిర్వహణకు నిధుల కొరత లేకుండా సక్రమంగా సాగాలని రైతులు ఆకాంక్షిస్తున్నారు.



గుండుమాల్‌లోని రైతువేదిక

ఆదాయ సమీకరణ ఇలా..

రెడ్‌కో సంస్థ అధికారిక లెక్కల ప్రకారం ఒక్కో రైతువేదికపై 5 కిలోవాట్ల సామర్థ్యం గల సౌర విద్యుత్ పలకలు బిగిస్తే నెలకు 600 యూనిట్ల విద్యుదుత్పత్తి అవుతుంది. సొంత అవసరాలకు 100 యూనిట్లు వినియోగించినా.. మిగిలిన 500 యూనిట్లను విక్రయించి ఆదాయం సమకూర్చుకోవచ్చు. యూనిట్ రూ.4కు అమ్మినా నెలకు రూ.2 వేలు, ఏడాదికి రూ.24 వేల ఆదాయం వస్తుంది. అయితే సౌర పలకల ఏర్పాటుకు ప్రభుత్వం ఒక్కో వేదికకు రూ.3 లక్షలు వెచ్చించాల్సి ఉంటుంది. కేంద్రం అమలు చేస్తున్న పీఎం కుసుమ్ పథకం కింద సౌర పలకలు ఏర్పాటు చేయనున్నారు.

ప్రభుత్వ నిర్ణయం మేరకే..



రైతులకు అందుబాటులో ఉంటూ సాగు సలహాలు, సూచనలు, సమీక్షల కోసం నిర్మించిన రైతువేదికల నిర్వహణకు నిధులు మంజూరుకావడం లేదు. సొంతంగా ఆదాయం సమకూర్చుకునేందుకు ప్రభుత్వం సౌర విద్యుత్ పలకలను ఏర్పాటు చేయడం హర్షణీయం. ప్రభుత్వ నిర్ణయంతో రైతులకు మరింత మెరుగైన సేవలు అందుతాయి.

– తిరుపతి, ఏఈఓ, గుండుమాల్ క్లస్టర్

అన్ని వేదికలపై ఏర్పాటు..

ఉమ్మడి జిల్లాలో పైలెట్ గ్రామాలైన జానంపేట, కొండారెడ్డిపల్లి రైతులవేదికల్లో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు విజయవంతమైంది. ఉమ్మడి జిల్లాలోని 467 రైతువేదికలపై ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. అన్ని భవనాలు ఒకే నమూనాలో నిర్మించడంతో సౌర పలకల బిగింపు ఒకేసారి చేపట్టేందుకు వీలుంటుంది. సౌర విద్యుత్ తయారీ, విక్రయం తదితర అంశాలకు సంబంధించి ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా తదుపరి చర్యలు తీసుకుంటాం.

– మనోహర్‌రెడ్డి, మేనేజర్, టీజీ రెడ్‌కో, ఉమ్మడి పాలమూరు జిల్లా

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో బాలుడి మృతి



భాను ప్రకాష్ (ఫైల్)

మాగనూర్: మండలంలోని మందిపల్లిలో విద్యుత్ షాక్‌తో బాలుడు మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. మందిపల్లి గ్రామానికి చెందిన బలరాం కుమారుడు భాను ప్రకాష్ (14) తన బాబాయి కొత్తగా ఇంటి నిర్మాణం చేపట్టాడు. ఈ క్రమంలో భాను ప్రకాష్ ఇంటికి క్యూరింగ్ చేసి మోటార్ ఆఫ్ చేసే క్రమంలో కరెంట్ షాక్‌కు గురై మరణించాడు. అయితే ప్రమాదంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని మాగనూర్ ఎస్‌ఐ అశోక్‌బాబు తెలిపారు.

అనుమానంతో భర్త అమానుషం

- భార్య మృత్యువాత
- పోలీసుస్టేషన్‌లో లొంగుబాటు



ఎల్లమ్మ (ఫైల్)

పెద్దకొత్తపల్లి: అనుమానంతో కట్టుకున్న భర్తే కాలయముడై భార్యపై దాడి చేసి చంపిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం గంట్రావ్‌పల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గురువారం రాత్రి గంట్రావ్‌పల్లికి చెందిన గొల్ల ఎలుక నాగేషు తన భార్య ఎల్లమ్మ (40) తలపై కర్రతో బలంగా కొట్టడంతో ఆమె స్పృహ తప్పి పడిపోయింది. బాధితురాలిని బంధువులు చికిత్స కోసం వనపర్తికి తరలిస్తుండగా.. మార్గ మధ్యలోనే మృతిచెందింది. దీంతో నాగేషు పెద్దకొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. మృతురాలి అన్న శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేష్, ఎస్‌ఐ సతీష్ తెలిపారు. ఘటనపై వారు గ్రామంలో విచారణ చేపట్టారు. వనపర్తి జిల్లా ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎల్లమ్మకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

కరెంట్ షాక్‌తో యువకుడి మృతి

మానవపాడు: మండలానికి చెందిన యశ్వంత్ కుమార్ (21) కరెంట్ షాక్‌కు గురై మరణించాడు. యశ్వంత్ కుమార్ ఇటీవల ఏపీలోని చిత్తూరు జిల్లా పుంగనూర్ మండలంలో సర్వే పనులకు వెళ్లాడు. అక్కడ విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. యువకుడు మృతి వార్త తెలియడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

చోరీ కేసులో మూడేళ్ల జైలుశిక్ష



కురుమూర్తి

ఆత్మకూర్: ఇంట్లో చోరీకి పాల్పడ్డ నిందితుడికి ఆత్మకూరు కోర్టు జడ్జి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.200 జరిమానా విధించారని డీఎస్పీ వెంకటేశ్వర రావు తెలిపారు. శుక్రవారం ఆత్మకూర్‌లో సీఐ శివకుమార్, ఎస్సై నరేందర్‌తో కలసి డీఎస్పీ వివరాలను వెల్లడించారు. ఫిబ్రవరి 23న ఆత్మకూర్‌లోని భార్గవినగర్‌లో నివాసముంటున్న మణివర్ధన్‌రెడ్డి నివాసంలోకి కురుమూర్తి అనే అతను చొరబడి రూ.1500 నగదు, పూజ సామగ్రిని ఎత్తుకెళ్లాడు. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకొని శుక్రవారం ఆత్మకూర్ కోర్టులో హాజరు పర్చగా వాదనలు విన్న అనంతరం న్యాయమూర్తి శ్రీలత దోషికి జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

విద్యుత్ తీగలు తెగి పడి గేదెల మృతి

మరికల్: ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తెగి పడి మూడు పాడి గేదెలు మృతి చెందిన ఘటన మరికల్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. మంతన్‌గోడు భాస్కర్‌రెడ్డికి చెందిన గేదెలు గ్రామ శివారులోని ఇబ్రహీంపట్నం రహదారి పక్కన మేత మేస్తుండగా ఆకస్మాత్తుగా విద్యుత్ తీగలు తెగి వాటిపై పడడంతో గేదెలు మరణించాయి. విషయం తెలుసుకున్న ట్రాన్స్‌కో సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని తెగిపడిన తీగలను తొలగించారు. పశు వైద్యాధికారి మహాదేవ్ మృతి చెందిన గేదెలకు పోస్టుమార్టం నిర్వహించి పంచనామా చేశారు. మరణించిన గేదెల విలువ రూ.2.50 లక్షలు ఉంటుందని, విద్యుత్ శాఖ తరఫున బాధిత రైతును ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

చారకొండ: మండలంలోని శేరి అప్పారెడ్డిపల్లిలో శుక్రవారం విద్యుదాఘాతానికి గురై గేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన గోలి జోగి రెడ్డి గేదెను మేత కోసం పొలంలో వదిలాడు. గేదె మేత మేసే క్రమంలో పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్తు వైరుకు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మరణించిన గేదె విలువ రూ.30 వేలు ఉంటుందని రైతు కన్నీటిపర్యంతమయ్యాడు. విషయం తెలుసుకున్న పశు వైద్యాధికారి షేక్ మదార్ ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు.

విషాదం మిగిల్చిన విహారయాత్ర

- ఎన్‌హెచ్–44పై ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు
- ప్రమాదంలో తల్లీకూతురు దుర్మరణం
- ప్రాణాలతో బయటపడిన తండ్రి, మరో కూతురు
- తిరుగు ప్రయాణంలో చోటు చేసుకున్న ఘటన



ప్రమాదానికి గురైన కారు



ఎర్ర శ్రావణి (ఫైల్)



సాయిచైత్ర (ఫైల్)

ఎర్రవల్లి: విహారయాత్ర ఓ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని వెనక నుండి కారు ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందగా.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలం మునగాల సమీపంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటేష్ వివరాల మేరకు.. హైదరాబాద్‌లోని నిజాంపేటకు చెందిన ఎర్ర వెంకటబాబ్జి ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్‌గా ఉద్యోగం చేస్తున్నారు. ఈ నెల 24న తన భార్య ఎర్ర శ్రావణి (38), పెద్ద కుమార్తె లక్ష్మీసహస్ర, చిన్న కుమార్తె సాయిచైత్ర (7)లతో కలిసి తమ కారులో విహారయాత్ర నిమిత్తం ఊటీకి వెళ్లారు. కుటుంబ సభ్యులతో కలిసి అక్కడ సంతోషంగా గడిపారు. గురువారం తెల్లవారుజామున తిరిగి తమ స్వగ్రామానికి కారులో బయలుదేరారు. మార్గమధ్యంలోని మునుగాల శివారులో జాతీయ రహదారిపై ఎలాంటి సూచికలు లేకుండా నిలిపిన లారీని వీరు ప్రయాణిస్తున్న కారు వెనక నుంచి వేగంగా ఢీకొట్టింది. ప్రమాదంలో కారు ముందుభాగం పూర్తిగా ధ్వంసం కాగా.. వెంకటబాబ్జి భార్య ఎర్ర శ్రావణికి తీవ్ర రక్తగాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందింది. తీవ్రంగా గాయపడిన చిన్న కుమార్తె సాయిచైత్రను కర్నూలు ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందింది. ప్రమాదం నుంచి గాయాలతో బయటపడిన వెంకటబాబ్జి, లక్ష్మీసహస్రలను చికిత్స నిమిత్తం కర్నూలు ఆస్పత్రికి తరలించారు. వెంకటబాబ్జి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి



అంజప్ప మృతదేహం

మక్తల్: ఇసుక టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన గొల్లపల్లిలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మక్తల్ మండలం మంతెన్ గోడ్ గ్రామానికి చెందిన గోసాయి అంజప్ప (45) ఇతర గ్రామాలకు వెళ్లి మెకానిక్ పని చేసుకుంటూ జీవించేవాడు. గురువారం కూడా పని నిమిత్తం బైక్‌పై మక్తల్ గ్రామానికి వెళ్తుండగా మక్తల్ నుంచి మహబూబ్‌నగర్‌కు ఇసుక లోడుతో వెళ్తున్న టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అంజప్ప అక్కడికక్కడే మరణించాడు. అంజప్పకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆచారి తెలిపారు.

కారు డ్రైవర్ నిర్లక్ష్యం: యువకుడి మృతి



బాలరాజు (ఫైల్)

కొత్తకోట: అతి వేగంగా దూసుకొచ్చిన కారు బైకును ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన గురువారం రాత్రి 11 గంటల సమయంలో కొత్తకోట మండలంలో చోటుచేసుకుంది. వనపర్తి నుంచి కొత్తకోట వైపుగా వస్తున్న కారు కొత్తకోటలోని బీపీఆర్ ఫంక్షన్ హాల్ వద్ద ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనం నడుపుతున్న బాలరాజు (25) అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై ఎస్‌ఐ ఆనంద్, మృతుడి తల్లి తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తకోట మండలంలోని రాఘవేంద్ర కాలనీలో నివసిస్తున్న దాసరి సుక్కమ్మ, శివన్నకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. భర్త అనారోగ్యంతో ఇంట్లో ఉంటుండడంతో కొడుకు బాలరాజు చేపలు అమ్మి జీవనం సాగిస్తున్నాడు. గురువారం రాత్రి 11 గంటల సమయంలో మండలంలోని కానాయపల్లి చెరువులో చేపలు పట్టేందుకు బాలరాజు తన ద్విచక్ర వాహనంపై బయలుదేరాడని తల్లి తెలిపారు. ఈ క్రమంలో స్థానిక బీపీఆర్ ఫంక్షన్‌హాల్ వద్దకు రాగానే కారు డ్రైవర్ అతివేగంగా ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టడంతో బాలరాజు తలకు రక్తపు గాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం వచ్చిందని తల్లి సుక్కమ్మ తెలిపారని ఎస్‌ఐ వివరించారు. ఘటన మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆనంద్ తెలిపారు.

ఇంట్రా డిస్ట్రిక్ట్ చాంపియన్‌గా మహబూబ్‌నగర్



విన్నర్ మహబూబ్‌నగర్ జట్టుతో ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ తదితరులు

- లీగ్‌లో నాలుగు విజయాలతో అగ్రస్థానం
- చివరి మ్యాచ్‌లో నారాయణపేటపై ఇన్నింగ్స్ గెలుపు

మహబూబ్‌నగర్ క్రీడలు: అండర్–23 ఇంట్రా డిస్ట్రిక్ట్ టూడే లీగ్‌లో మహబూబ్‌నగర్ జట్టు చాంపియన్‌గా నిలిచింది. లీగ్‌లో మొదటి నుంచి మెరుగైన ప్రదర్శన కనబరిచిన మహబూబ్‌నగర్ జట్టు వర్షం వల్ల ఒక మ్యాచ్ రద్దు కాగా మిగిలిన 4 మ్యాచుల్లో విజయాలు సాధించి 22 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. లీగ్‌లో మహబూబ్‌నగర్ జట్టు బౌలర్ ఎండీ ముఖితుద్దీన్ అత్యధికంగా 35 వికెట్లు తీశాడు.

– జిల్లా కేంద్రానికి సమీపంలోని సమర్థ స్కూల్ మైదానంలో శుక్రవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ ఇన్నింగ్స్ 52 పరుగుల తేడాతో నారాయణపేటపై గెలుపొందింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన మహబూబ్‌నగర్ 49.5 ఓవర్లలో 208 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులో అక్షయ్ 103 బంతుల్లో 3 సిక్సులు, 4 ఫోర్లతో 63 పరుగులు చేశాడు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ బ్యాటింగ్ చేపట్టిన నారాయణపేట జట్టు 24.2 ఓవర్లలో కేవలం 72 పరుగులకు ఆలౌట్ అయింది. మహబూబ్‌నగర్ బౌలర్లు ముఖితుద్దీన్ 18 పరుగులు ఇచ్చి 4, షాదాబ్ అహ్మద్ 11 పరుగులకు 3, శశాంక్ 14 పరుగులు ఇచ్చి 2 వికెట్లు తీశారు. అనంతరం ఫాలోఆన్ ఆడిన నారాయణపేట రెండో ఇన్నింగ్స్‌లో 17.5 ఓవర్లలో 84 పరుగులకు ఆలౌట్ అయింది. రెండో ఇన్నింగ్స్‌లో ముఖితుద్దీన్ అ 6.5 ఓవర్లలో 48 పరుగులు ఇచ్చి 6 వికెట్లు తీసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు.

రానున్న హెచ్‌సీఏ టోర్నీల్లో ప్రతిభచాటాలి

రానున్న హెచ్‌సీఏ టోర్నీల్లో క్రీడాకారులు ప్రతిభచాటాలని ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ అన్నారు. అండర్–23 ఇంట్రా డిస్ట్రిక్ట్ టూడే లీగ్ చాంపియన్‌గా నిలిచిన మహబూబ్‌నగర్ జట్టును ఆయన అభినందించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని క్రీడాకారులను ప్రోత్సహించడానికి మొదటిసారిగా ఆరు జట్లతో అండర్–23 ఇంట్రా డిస్ట్రిక్ట్ లీగ్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ లీగ్‌లో రాణించిన క్రీడాకారులను 24 మందితో రెండు జట్లుగా విభజించి మూడు మ్యాచ్‌లు నిర్వహించి ప్రతిభచాటే 15 మంది తుది జట్టును ఎంపిక చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నారాయణపేట జిల్లాకు చెందిన డీఎంహెచ్‌ఓ జయచంద్ర మోహన్, డీపీఓ బిక్షపతి, కోచ్ రమణ, శ్రీనివాస్‌గౌడ్, ఉమేష్‌కుమార్, సీనియర్ క్రీడాకారులు ముఖ్తార్, రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

నలుగురు వేటగాళ్లు అరెస్ట్



ఉడుములతో పట్టుబడిన వేటగాళ్లు

లింగాల: నాగర్ కర్నూల్ జిల్లా లింగాల మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలో నలుగురు వేటగాళ్లను అదుపులోకి తీసుకున్నట్లు అటవీ శాఖ రేంజర్ ఈశ్వర్ తెలిపారు. పద్మన్నపల్లికి చెందిన కాట్రాజు రాజు, కాట్రాజు నిరంజన్, రాయ బాలయ్య, బల్మూరి లింగస్వామి రమేష్ ఉడుములను పట్టుకొని వెళ్తుండగా గుండాల ప్రాంతంలో అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. అలాగే స్వాధీనం చేసుకున్న ఉడుములలో మూడు చనిపోయి ఉండగా మరో 6 బతికి ఉండడంతో వాటిని బేస్ క్యాంపు దగ్గర ఉంచినట్లు వెల్లడించారు. వన్య ప్రాణుల రక్షణ చట్టం ప్రకారం వన్య ప్రాణులను వేటాడటం నేరమని, అదుపులోకి తీసుకున్న నిందితులను త్వరలో కోర్టులో హాజరు పర్చనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్వోతో పాటు డీఆర్వో జయదేవ్, ఎఫ్‌బీఓ శివాజీ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

హన్వాడ: మండలంలోని వేపూర్ వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ వెంకటేష్ వివరాల మేరకు.. వేపూర్‌కు చెందిన గణేశ్, అనిల్ ఎలాంటి అనుమతులు లేకుండా వాగు నుంచి తమ ట్రాక్టర్లలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ట్రాక్టర్లను పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. వారిద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వీధికుక్క దాడిలో 10 మందికి గాయాలు



కుక్క దాడిలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు



కుక్క దాడితో మైసమ్మ అనే మహిళ కాలికి అయిన గాయం

ఒకరి పరిస్థితి విషమం.. జిల్లా ఆస్పత్రికి తరలింపు

జడ్చర్ల టౌన్: పట్టణంలో శుక్రవారం ఓ వీధికుక్క స్వైరవిహారం చేస్తూ కనిపించిన వారినల్లా గాయపర్చింది. కుక్క దాడిలో తీవ్రంగా గాయపడిన ఓ మహిళ పరిస్థితి విషమంగా ఉండటంతో చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. ఇందిరానగర్ కాలనీలోని వడ్డెర గేరిలో ఓ కుక్క అకస్మాత్తుగా మనుషులపై దాడి చేయడం ప్రారంభించింది. కనిపించిన వారందరిపైకి దూకడంతో ఆ ప్రాంత వాసులు హడలెత్తిపోయారు. వడ్డెర గేరిలోనే 5మందిపై దాడిచేసి గాయపర్చింది. అనంతరం అక్కడి నుంచి ప్రధాన రహదారి మీదుగా వేంకటేశ్వరస్వామి దేవస్థానం వైపు పరుగెత్తింది. మార్గమధ్యంలో పూలు అమ్ముకునే ఓ మహిళను తీవ్రంగా గాయపర్చింది. అదే విధంగా రోడ్డుపై వెదురుబొంగులు విక్రయించుకునే లక్ష్మీదేవమ్మ అనే మహిళపై దాడిచేసింది. ఆమె రెండు చేతులపై తీవ్రంగా దాడి చేయడంతో మాంసం ముద్దలు రోడ్డుపై పడ్డాయి. స్థానికులు కుక్కను బెదిరించటంతో అక్కడి నుంచి పరుగు తీసింది. ఈ క్రమంలోనే వేంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద ఓ బాలుడిపై దాడిచేసి తీవ్రంగా గాయపర్చింది. కుక్కదాడిలో ముగ్గురు చిన్నారులు, ఏడుగురు పెద్దలు గాయపడ్డారు. కుక్క దాడులకు పాల్పడిన ప్రాంతాల్లో ఆహాకారాలు మిన్నంటాయి. ఏం జరుగుతుందో తెలియక స్థానికులు ఆందోళనకు గురయ్యారు. కుక్కదాడిలో తీవ్రంగా గాయపడిన లక్ష్మీదేవమ్మను జడ్చర్ల ఏరియా ఆస్పత్రికి తరలించగా.. ప్రాథమిక చికిత్స అనంతరం జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేశారు. కుక్క దాడిలో గాయపడిన వారిలో వెంకటేశ్, రామ్, బిందు, మైసమ్మ తదితరులు ఉన్నారు. మున్సిపాలిటీలో స్వైరవిహారం చేస్తున్న కుక్కలను నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు.

కుక్కల దాడిలో గొర్రెలు మృతి

అయిజ: కుక్కల దాడిలో మేకలు, గొర్రెలు మృతిచెందిన ఘటన మండలంలోని చిన్న తాండ్రపాడులో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. చిన్న తాండ్రపాడు రైతువేదిక భవనం సమీపంలో తెలుగు రాముడు తన మేకలు, గొర్రెల మందను నిలిపి ఇంటికి వెళ్లాడు. ఇదే సమయంలో గ్రామంలోని వీధి కుక్కలు మందలోకి చేరి 16 గొర్రెలు, 17 మేకలపై దాడిచేసి చంపివేశాయి. బాధిత రైతును ప్రభుత్వపరంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

మూలమళ్లలో మొసళ్ల కలకలం

- పదుల సంఖ్యలో సంచారం
- భయాందోళనల్లో గ్రామస్తులు



మూలమళ్ల చెరువు కట్టపై సంచరిస్తున్న మొసలి

ఆత్మకూర్: మండలంలోని మూలమళ్లలో మొసళ్ల సంచారం కలకలం రేపుతుండడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామ శివారులోని చెరువుకట్ట మీద శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో మొసళ్లు ఉండడంతో అటుగా వస్తున్న కొందరు వాటిని చూసి పరుగులు పెట్టారు. అనంతరం అక్కడికి చేరుకున్న గ్రామస్తులు కేకలు వేయడంతో అవి చెరువులోకి వెళ్లాయి.

ఫారెస్టు అధికారులు స్పందించాలి..

మూలమళ్లలో రెండేళ్లుగా మొసళ్ల సంచారం అధికమైందని, ఇప్పటికే పలుమార్లు మనుషులు, పశువులపై దాడులు చేసిన ఘటనలు చోటు చేసుకుంటున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూలమళ్ల చెరువుతో పాటు, దిగువ జూరాల బ్యాక్‌వాటర్‌లో, ప్రధాన ఎడుమ కాల్వ, సమాంతర కాల్వల్లో వందల సంఖ్యలో మొసళ్లు ఉన్నాయని, ఈ మధ్యనే గొర్రెల కాపరిపై దాడి చేయడంతో పూర్తిగా కాలును కోల్పోయాడని గుర్తు చేస్తున్నారు. ఘటనపై ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి స్పందించి ఫారెస్టు అధికారులను గ్రామానికి పంపించి తమ ప్రాణాలు కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో రాములోరి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

ఎర్రవల్లి: శ్రీరాముడి జన్మనక్షత్రమైన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని కోదండరామస్వామి ఆలయంలో శుక్రవారం సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు భానుమూర్తి, దత్తుస్వామి ఆధ్వర్యంలో సీతారాములను అలంకరించి వేదమంత్రాల నడుమ వైభవంగా కల్యాణం జరిపించారు. దీంతో ఆలయ చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరైన పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి భక్తిశ్రద్ధలతో సీతారాముల కల్యాణాన్ని తిలకించారు. భక్తులకు ఆలయ పాలక మండలి ఆధ్వర్యంలో అన్నదానం చేసినట్లు మేనేజర్ సురేందర్‌రాజు పేర్కొన్నారు.

గ్రామీణ విలేకర్లకు కంప్యూటర్ శిక్షణ



మాట్లాడుతున్న ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

మన్ననూర్: గ్రామీణ విలేకర్లలో వృత్తి నైపుణ్యం పెంపొందించేందుకు ప్రెస్ అకాడమీ తరఫున త్వరలోనే కంప్యూటర్ శిక్షణ ఇప్పిస్తామని చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ సౌజన్యంతో మన్ననూర్‌లోని అటవీశాఖ వనమాలికా ప్రాంగణంలో జర్నలిస్టులకు రెండు రోజులపాటు నిర్వహించిన శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాండ్ వైభవ్ రఘునాథ్‌తో కలిసి ప్రెస్ అకాడమీ చైర్మన్ హాజరై మాట్లాడారు. జర్నలిస్టులు నైతిక విలువలు పాటించకపోతే ప్రజల్లో నమ్మకం తగ్గుతుందన్నారు. శిక్షణ తరగతులకు హాజరైన వారిలో 90 శాతం ఉన్నత విద్యాభ్యాసం చేసిన వారు ఉండటం సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ వార్తా కథనాల విశ్వసనీయతపై దృష్టి పెట్టాలన్నారు. వర్కింగ్ జర్నలిస్టు యాక్ట్ అనుసరిస్తూ.. విధులు నిర్వహించే వారే అసలైన జర్నలిస్టులనే విషయాన్ని గమనించాలని సూచించారు. జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల కోసం 1952లో మీడియా చట్టం అమలులోకి రాగా.. ఫ్రెండ్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా 1995లో అందుబాటులోకి వచ్చిందని తెలిపారు.

■ కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ.. పరిపాలనా యంత్రాంగంలో జర్నలిజం నాలుగో స్థానమని అన్నారు. ప్రభుత్వం, ప్రజలకు వారధిగా ఉన్న మీడియాతోనే ప్రజలకు జవాబుదారీ తనం ఉంటుందన్నారు. వచ్చే నెల చివరి వారం నుంచి ప్రతినెలా జిల్లాలోని జర్నలిస్టులతో సమావేశాలు ఏర్పాటుచేసి.. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం జిల్లాలో కొనసాగుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కలెక్టర్ వివరించారు. ఎస్పీ గైక్వాండ్ వైభవ్ రఘునాథ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం సోషల్ మీడియా ప్రభావం పెరగడంతో మీడియా రంగంలో సమూల మార్పులు వచ్చాయన్నారు. జర్నలిస్టులకు బస్సు పాస్, హెల్త్ కార్డు, వారి పిల్లలకు ఉచిత విద్య అవకాశం కల్పించాలని యూనియన్ జిల్లా నాయకుడు సుధాకర్‌రెడ్డి కోరారు. కాగా, క్రైం వార్తల ప్రచురణ తదితర అంశాల గురించి టైమ్స్ ఆఫ్ ఇండియా ఎడిటర్ కుడుముల సుధాకర్‌రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు సమాచార సేకణ, ప్రజెంటేషన్, వాటి భద్రత తదితర అంశాలను సీనియర్ జర్నలిస్టు తోట భావనారాయణ వివరించారు. జర్నలిస్టులకు 10 రకాల పుస్తకాల కిట్టు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ వైస్‌చైర్మన్ విరసత్ అలీ, ప్రతినిధులు మధు, రాములు, విజయ్, మోహన్ పాల్గొన్నారు.

సందర్శకులతో జూరాల కిటకిట



జూరాల ప్రాజెక్టును సందర్శించిన పర్యాటకులు

ధరూరు: నైరుతి రుతు పవనాల రాకతో జిల్లాలో వర్షాలు విస్తృంగా కురుస్తుండడంతో జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఈ సీజన్‌లో ప్రాజెక్టుకు మొదటి సారిగా వరద నీరు రావడం.. అదే రోజు గేట్లను ఎత్తడంతో కృష్ణమ్మ అందాలను వీక్షించేందుకు జిల్లా నలుమూలలతో పాటు కర్ణాటక, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి సందర్శకులు తరలివచ్చారు. దీంతో శుక్రవారం ప్రాజెక్టు పరిసరాలు సందర్శకులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా చిన్నారులు, యువత సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఉదయం నుంచి ప్రాజెక్టు వద్ద గద్వాల, వనపర్తి జిల్లాలకు చెందిన పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రమాదభరిత ప్రాంతాలకు పర్యాటకులు వెళ్లకుండా కంచె వేశారు.

కృష్ణానదిలో పెరుగుతున్న నీటిమట్టం

కొల్లాపూర్: ఎగువ నుంచి వరద జలాలు రావడంతో కృష్ణానదిలో నీటిమట్టం అంతకంతకూ పెరుగుతోంది. జూరాల నుంచి శ్రీశైలం బేసిన్‌కు 80 వేల క్యూసెక్కుల మేరకు నీటిని విడుదల చేయడంతో బ్యాక్ వాటర్ లెవెల్స్ శుక్రవారం నాలుగు అడుగుల మేరకు పెరిగింది. శ్రీశైలం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 821 అడుగులకు చేరినట్లు అధికారులు తెలిపారు. వరద ఉధృతి ఇలాగే కొనసాగితే త్వరలోనే సంగమేశ్వరుడి ఆలయం మళ్లీ నీటిలో మునిగిపోనుంది. ఈ ఏడాది మార్చి 21 నుంచే సంగమేశ్వర ఆలయంలో పూజలు ప్రారంభయ్యాయి. కేవలం రెండు నెలల వ్యవధిలోనే గుడి వద్దకు నీళ్లు చేరుకోవడం ఇదే తొలిసారని పూజారులు, స్థానికులు చెబుతున్నారు.



సంగమేశ్వర గుడి సమీపంలో కృష్ణానది నీటిమట్టం